


# మన దునియా

RNI Number
TELTEL/2023/85680


మన అక్షరం - మన ప్రపంచం




సంపుటి : 3 | సంచిక : 276 | జూన్ 3 బుధవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-

# అనుమతి ఒక్కటి... నిర్వహణ నాలుగా..!?




**మన దునియా,హనుమకొండ:జూన్ 02**

హనుమకొండ నగరంలో "వైబ్రాంట్ అకాడమీ" పేరుతో నిర్వహిస్తున్న జూనియర్ కాలేజీల వ్యవహారం పలు అనుమానాలకు, విమర్శలకు తావిస్తోంది. ఒకే అనుమతితో అనేక చోట్ల అకాడమీలు, జూనియర్ కాలేజీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తుండగా, దీనిపై సంబంధిత అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కోట పేరు... కోట్ల వ్యాపారమా..?

రాజస్థాన్‌లోని కోట విద్యా విధానాన్ని ఆదర్శంగా తీసుకున్నామని ప్రచారం చేస్తూ విద్యార్థులను ఆకర్షిస్తున్న వైబ్రాంట్ అకాడమీ, తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తాల్లో ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మెరుగైన ఫలితాలు, ప్రత్యేక శిక్షణ పేరుతో లక్షల రూపాయలు తీసుకుంటున్నప్పటికీ, సంస్థ నిర్వహణకు సంబంధించిన అనుమతులపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

అనుమతి ఎక్కడ..? బ్రాంచీలు ఎన్ని..?

విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఒక విద్యాసంస్థకు మంజూరైన అనుమతులతోనే కార్యకలాపాలు నిర్వహించాలి. అయితే వైబ్రాంట్ అకాడమీ పేరుతో నగరంలోని పలు ప్రాంతాల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అసలు ఎన్ని బ్రాంచీలకు అనుమతి ఉంది? ఏ ప్రాంగణంలో కళాశాల

(మిగతా 2వ పేజీలో..)

## ఆగస్టు 6 లోపు ట్యాంక్ బండ్‌పై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: కవిత

జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్న కవిత

అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్

డిమాండ్లను నెరవేర్చకపోతే భారీ ఉద్యమం చేస్తామని హెచ్చరిక

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి రోజైన (మిగతా 4వ పేజీలో..)



## పవన్ వ్యాఖ్యలకు పొన్నం ఘాటు కౌంటం

**మన దునియా,హైదరాబాద్:జూన్ 02**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. "తెలంగాణ బరాబర్ మా అయ్య జాగీరే" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన (మిగతా 2వ పేజీలో..)




## విద్రోహ శక్తుల నుండి మన తెలంగాణను కాపాడుకుందాం: కేటీఆర్

జూన్ 2వ తేదీ తెలంగాణ చరిత్రలోనే అద్భుతమైన రోజు అన్న కేటీఆర్

తెలంగాణ ప్రగతి, ప్రజల సంక్షేమనే లక్ష్యంగా బీఆర్ఎస్ పని చేసిందని వ్యాఖ్య

తెలంగాణ అస్తిత్వానికి రక్షణ కవచంలా నిలబడిందన్న కేటీఆర్



తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దశాబ్దాల తరబడి సాగిన వివక్ష, అవమానాలు, అణచివేతకు (మిగతా 4వ పేజీలో..)

## రూ.62.20 కోట్ల సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

భూసార పరిరక్షణకు కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం

రైతులకు పెట్టుబడి భారం తగ్గించి అధిక దిగుబడులే లక్ష్యం

పచ్చిరొట్ట సాగుతో నేల సారం పెంపు, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు

వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**మన దునియా అమరావతి, జూన్ 02:**

రైతు సంక్షేమం, భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్--2026 సీజన్‌లో పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా (మిగతా 2వ పేజీలో..)



మన దునియా

# పవన్ వ్యాఖ్యలకు పొన్నం ఘాటు కౌంటం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన, ఈ ప్రాంతం తమ తండ్రులు, తాతల భూమి అని పేర్కొన్నారు.పవన్ కల్యాణ్ మరోసారి అహంకారాన్ని ప్రదర్శించారని విమర్శించిన పొన్నం, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరైంది కాదన్నారు. ఏపీలోనే తనకు రాజకీయంగా దిక్కు లేదని పవన్ స్వయంగా ఒప్పుకున్నట్లుగా ఆయన వ్యాఖ్యలను అభివర్ణించారు.తెలంగాణ ఉద్యమ సమయంలో పవన్ కల్యాణ్ ఎప్పుడైనా ఉద్యమకారులకు మద్దతుగా నిలిచారా అని ప్రశ్నించిన మంత్రి, అమరవీరుల కుటుంబాలకు ఏనాడైనా అండగా నిలిచారా అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై గతంలోనూ, ఇప్పుడూ పవన్ వైఖరి ఒకేలా ఉందని, తెలంగాణపై మరోసారి తన అక్కసును వెళ్లగక్కారని మండిపడ్డారు.రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, తెలంగాణ ప్రజలు వాటిని గమనిస్తున్నారని పొన్నం వ్యాఖ్యానించారు.

# రూ.62.20 కోట్ల సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రైతులకు అవసరమైన మద్దతు అందిస్తోందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 62.20 కోట్ల సబ్సిడీని కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 91,918 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు కేటాయించగా, అందులో జీలుగ 50,311 క్వింటాళ్లు, జనుము 21,291 క్వింటాళ్లు, పిల్లి పెసర 20,316 క్వింటాళ్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 40,459 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు సరఫరా చేయగా, 19,667 మంది రైతులకు 5,687 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసి రూ. 4.76 కోట్ల సబ్సిడీ ప్రయోజనాన్ని అందించినట్లు చెప్పారు.పచ్చిరొట్ట పంటలు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి వివరించారు. ఈ పంటలను భూమిలో కలపడం ద్వారా సేంద్రియ కార్బన్ శాతం పెరగడంతో పాటు నత్రజని నిల్వలు అధికమవుతాయని తెలిపారు. దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గి, రైతుల సాగు వ్యయం నియంత్రణలో ఉండటమే కాకుండా భూముల ఉత్పాదకత కూడా గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. సహజ, సేంద్రియ వ్యవసాయ విధానాల పట్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ పంటల ప్రాముఖ్యతను వివరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహానికి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.కృష్ణా, గుంటూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, ఏలూరు, బాపట్ల, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది రైతులు ఇప్పటికే లబ్ధి పొందినట్లు మంత్రి వెల్లడించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాల సరఫరాను మరింత పెంచి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని కేవలం జీవనాధార రంగంగా కాకుండా ఆదాయాన్ని పెంచే రంగంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. నాణ్యమైన విత్తనాల పంపిణీ, సబ్సిడీ పథకాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నీటి వనరుల సమర్థ నిర్వహణ, భూసార పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటే రైతు అభివృద్ధి చెందుతాడు.. రైతు అభివృద్ధి చెందితే రాష్ట్రం పురోగమిస్తుంది అనే సంకల్పంతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.




# ఆగస్టు 6 లోపు ట్యాంక్ బండ్‌పై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 6వ తేదీ లోపు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని తెలంగాణ రాష్ట్ర సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై 12 ఏళ్లు పూర్తయినప్పటికీ, స్వరాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన వెన్నెముకగా నిలిచిన జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రభుత్వం ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర విచారకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఆగస్టు 6 లోపు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైతే, కనీసం తమ పార్టీకైనా అనుమతి ఇవ్వాలని, తామే స్వయంగా ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూనే, స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు, ఉద్యమకారులకు ఆమె ఘన నివాళులర్పించారు.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సరైన గుర్తింపు, గౌరవం దక్కాలని ఆమె కోరారు. అలాగే జూలై 2వ తేదీ లోపు అమరవీరుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండ్లను నెరవేర్చకపోతే, తమ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్ వేదికగా ఒక భారీ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా, పెద్ద ఎత్తున వంటా–వార్పు నిరసన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని తెలిపారు. అమరవీరుల త్యాగాలను మరవకుండా ఉద్యమ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగించాలని హితవు పలికారు.

# విద్రోహ శక్తుల నుండి మన తెలంగాణను కాపాడుకుందాం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ముగింపు పలికిన జూన్ 2వ తేదీ తెలంగాణ చరిత్రలోనే అత్యంత అద్భుతమైన రోజని ఆయన అభివర్ణించారు. అమరవీరుల త్యాగాలు, ఉమ్మడి ఆత్మగౌరవ పోరాటం వల్లే తెలంగాణ ప్రజలు విముక్తి సాధించారని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఉద్యమ కాలంలో వినిపించిన “తెలంగాణ వచ్చుడా... కేసీఆర్ సచ్చుడా” అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ.. 60 ఏళ్ల సుదీర్ఘ కలని నిజం చేయడంలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర రావు పోషించిన కీలక పాత్రను కేటీఆర్ కొనియాడారు. 14 ఏళ్ల పాటు సాగిన సుదీర్ఘ స్వరాష్ట్ర ఉద్యమంలో కానీ, ఆ తర్వాత తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కానీ, కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రగతి, ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా పనిచేసిందని స్పష్టం చేశారు. నేటికీ తమ పార్టీ ప్రజల గొంతుకగా నిలుస్తూ... తెలంగాణ అస్తిత్వానికి, ప్రగతికి ఒక రక్షణ కవచంలా నిలబడిందని పేర్కొన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతున్న తరుణంలో ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు ఒక ప్రత్యక్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల సేవ కోసం ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త పునరంకితం కావాలని కోరారు. తెలంగాణను దెబ్బతీయాలని చూస్తున్న విద్రోహ, వ్యతిరేక శక్తుల నుండి మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఈ ఆవిర్భావ దినోత్సవం సాక్షిగా మనమంతా మళ్లీ ఒకసారి ప్రతిజ్ఞ చేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఈ సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు.

# అనుమతి ఒక్కటి... నిర్వహణ నాలుగా..!?

నడపడానికి గుర్తింపు పొందింది? అనే విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**అధికారుల కళ్లు మూసుకుపోయాయా..?**


అనుమతులు లేని లేదా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ వైబ్రాంట్ అకాడమీ విషయంలో ఇప్పటివరకు ఎలాంటి తనిఖీలు, చర్యలు కనిపించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొందరు అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థల ఒత్తిళ్లకు లోనవుతున్నారా అనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

**విద్యార్థుల భవిష్యత్తు ఎవరి బాధ్యత..?**

తల్లిదండ్రులు తమ పిల్లల ఉన్నత విద్య కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానీ అనుమతులు, గుర్తింపులపై స్పష్టత లేని సంస్థల్లో చదివితే భవిష్యత్తులో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అందుకే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, ఇంటర్మీడియట్ విద్యాశాఖ వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు బాధ్యత ఎవరిది?**

విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో, ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ప్రజలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విచారణ జరిగితేనే నిజాలు బయటపడతాయా... లేక ఈ వ్యవహారం కూడా కాలగర్భంలో కలిసిపోతుందా అనేది వేచి చూడాలి.



# ఘనంగా 12వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు




**జీఎం ఎన్. రాధాకృష్ణ**

**మన దునియా, జూన్ 02,మంచిర్యాల**

మందమర్రి ఏరియా పరిధిలో 12వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం) ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, ఏరియా స్థాయి అధికారిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా వ్యాప్తంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయని,ఉదయం 07:00 గంటలకు: రామకృష్ణాపూర్‌లోని అమరవీరుల స్తూపానికి ఘన నివాళు లర్పించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఉదయం 07:30 గంటలకు: ఆర్కేపీలోని ఠాగూర్ స్టేడియంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉదయం 08:00 గంటలకు: మందమర్రి ఎస్.సి. హైస్కూల్ మైదానంలో తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. ఉదయం 08:30 గంటలకు: ఎస్.సి. హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఏరియా జీఎం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఉదయం 09:30 గంటలకు: జీఎం కార్యాలయంలో (జీఎం ఆఫీస్) తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు నివాళు లర్పించి, పతాకావిష్కరణ చేశారు. అనంతరం రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీ.ఎం ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ, ఎందరో అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల పోరాటాల ఫలితంగా సిద్ధించిన గడ్డ మన తెలంగాణ అని కొనియాడారు. సాంస్కృతిక వైభవానికి, వీరత్వానికి ప్రతీక అయిన తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో దూసుకుపోతోందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో, చీకట్లను చీల్చి వెలుగులు నింపడంలో 'తెలంగాణ కామధేనువు' సింగరేణి సంస్థ మరియు ఉద్యోగుల శ్రమ వెలకట్టలేనిదని, అదే సంకల్పంతో రాష్ట్రాభివృద్ధిలో మనమంతా భాగస్వామ్యులం కావాలని పిలుపునిచ్చారు.

సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు:

మంగళవారం సాయంత్రం 06:00 గంటల నుండి మందమర్రిలోని ఎస్.సి. హైస్కూల్ మైదానంలో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం (ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్) కూడా జరగనుంది. సింగరేణి ఉత్తమ ఉద్యోగులకు గణంగా సన్మాన కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఎస్ వో టూ జిఎం జి.ఎల్ ప్రసాద్,ఏఐటీయూసీ మందమర్రి, బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ,సీఎంఓఏఐ అధ్యక్షులు రమేష్, కేకే గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ (ఈఅండ్ ఎం), బాలాజీ భగవతి జ, డీజీఎం పర్సనల్ అశోక్,డీజీఎం ఐ ఈ డి కిరణ్ కుమార్, ఏఐటీయూసీ రామకృష్ణ పూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, జి.ఎం కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**మన దునియా, జూన్ 02,మంచిర్యాల**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు మందమర్రి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్ మాట్లాడుతూ చెన్నూరు ప్రాంత ప్రజలకు ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ నీళ్లు నిధులు నియామకాలు అని చెప్పి విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకుంటే సబ్బండ వర్గాలు టిఆర్ఎస్ పార్టీ కుటుంబ పాలన చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన పార్టీ అని ఆయన అన్నారు అదేవిధంగా చంద్రబాబు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ తెలుగు ప్రజలు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ముందుకు పోవాలని ఆకాంక్షించే గొప్ప నాయకుడని రాష్ట్రాలకు పెట్టుబడును తెప్పించి భారతదేశంలోని రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని నిరంతరం ఆలోచించే నాయకుడు చంద్రబాబు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కారం రాజు, మహిళా రాష్ట్ర.ప్రధాన కార్యదర్శి ఎండి షరీఫ, ఉపాధ్యక్షులు జె స్వామి, ఉడ్నాల సత్యనారాయణ, మున్సిపల్ ఇంచార్జి కోడి వారి కవిత, రజియా, బొబ్బర భాగ్య, రమాదేవి, నరసమ్మ, కోడిపెల్లి రాజయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్



**ఖానాపూర్ ఆర్సి మన దునియా ,జూన్;02.**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు .ముందుగా బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ఆయన, అనంతరం ఖానాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమం ద్వారా సాధించిన రాష్ట్రం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తదుపరి ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఆత్మగౌరవం, స్వాభిమానం, ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అభివృద్ధి, రైతులు, యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధనకే తమ రాజకీయ ప్రయాణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## జన్నారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**ఖానాపూర్ ఆర్సి మన దునియా ,జూన్;02.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జాతీయ జెండాతో పాటు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నో త్యాగాలు, ఉద్యమాలు, అమరవీరుల పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ పార్టీ మరియు ఉద్యమ నాయకుల పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి, తెలంగాణ గీతాలు ఆలపిస్తూ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ వేడుకలు ముగిశాయి.

మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

## తెలంగాణ ఆవిర్భా దినోత్సవం సందర్భంగా,

**బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామ పంచాయతీ తీర్మానం**

**కార్యదర్శి కి వినతి పత్రం అందజేసిన భీంపల్లి గ్రామ పాలకవర్గం**



**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల భీంపల్లి గ్రామ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధించాలని గ్రామ పంచాయతీ ప్రత్యేక సమావేశంలో తీర్మానించింది. గ్రామంలో బెల్ట్ షాపుల వల్ల యువత చెడు అలవాట్లకు గురవుతున్నారని, కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించి బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గ్రామంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే సంబంధిత శాఖలకు సమాచారం అందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామస్థులందరూ సహకరించాలని, గ్రామాన్ని మద్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు ముందుకు రావాలని పంచాయతీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. గ్రామంలో శాంతి భద్రతలు, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.అక్రమ మద్యం విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని పంచాయతీ హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే పదివేల,జరిమానా విధిస్తామని సూచించారు, బెల్ట్ షాప్ యజమానులు దొంగ చాటున దందా కొనసాగిస్తే గ్రామంలోని ప్రజలు సమాచారం అందిస్తే పారితోషకం ఇస్తామని తెలియజేశారు,ఈ నెల 15/6/2026 వరకు, నిలువ ఉన్న మద్యం సరుకు అమ్మకం పూర్తి చేసుకోవాల్సిందిగా యాజమాన్యానికి హెచ్చరించారు,

## కుమారుడిని చంపి.. మిస్సింగ్ అంటూ కోర్టుకెక్కి!

**వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని మహిళ ఘాతుకం ఏడాదిన్నర తర్వాత మృతదేహం వెలికితీత నిజం నిగ్గుతేలిన వేళ తల్లి అనుమానాస్పద మృతి**

**మన దునియా,కర్నూలు జిల్లా: జూన్ 02**

కర్నూలు : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని నిలువెత్తు కుమారుడిని ప్రియుడితో కలిసి చంపేసిన ఓ తల్లి.. ఆ వాస్తవం బయటపడిన సమయానికి పోలీసుల విచారణ క్రమంలో అనుమానాస్పదంగా మృతిచెందింది. కని పెంచిన చేతులతోనే బిడ్డ ప్రాణాలు తీసింది కాక, మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించడం లేదంటూ ఆమె హైకోర్టు మెట్లెక్కడం ఈ కేసులో విస్మయం కలిగించే అంశం. కర్నూలు జిల్లా కౌతాళం మండలం బదినేహాలు గ్రామానికి చెందిన చిన్నమల్లయ్య, గంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. చిన్నమల్లయ్య కొన్నాళ్ల క్రితం రోడ్డుప్రమాదంలో చనిపోయారు. ఆమెకు ఆదోని మండలం జి.హొసళ్లి గ్రామానికి చెందిన బంధువు దర్గప్పతో వివాహేతర సంబంధం ఏర్పడింది. దర్గప్ప తరచూ తమ ఇంటికి రావడం నచ్చని గంగమ్మ పెద్దకుమారుడు వీరేశ్(17).. అతనితో పలుమార్లు గొడవపడ్డాడు. వీరేశ్ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న గంగమ్మ, దర్గప్ప.. 2024 నవంబరులో ఇంట్లోనే అతన్ని కత్తితో పొడిచి చంపేశారు. మృతదేహాన్ని దుప్పట్లో చుట్టేసి, బైక్పై తీసుకెళ్లి సమీప శ్మశానవాటికలో పాతిపెట్టారు. తన కుమారుడు వీరేశ్ కనిపించడం లేదని 2024 నవంబరు 11న గంగమ్మ కౌతాళం ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ కేసును తేల్చలేకపోయారు.

డబ్బులకు కక్కుర్తి పడి..:

హైకోర్టును ఆశ్రయిస్తే ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయని కొందరు సలహా ఇవ్వడంతో ఆశపడిన గంగమ్మ.. తన కుమారుడి ఆచూకీ తెలియడం లేదని, పోలీసులు సరిగ్గా వెతకడం లేదని ఇటీవల పిటిషన్ వేశారు. దీన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించి, వీరేశ్ అదృశ్యంపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించింది. స్పందించిన డీజీపీ.. ఈ కేసు దర్యాప్తునకు గుంటూరు సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ, డీఎస్పీ రవికుమార్ తదితరులతో సిట్ వేశారు. రెండు వారాలుగా సిట్ సభ్యులు ఆరాతీయగా, గంగమ్మ కిరాతకం బయటపడింది. వీరేశ్ను గంగమ్మ, దర్గప్పలు కలిసి చంపేసినట్లు నిర్ధారించుకున్నారు. పోలీసులు ఆదివారం జి.హొసళ్లికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. అస్థిపంజరం వద్ద దొరికిన తాడు, టవల్, దుప్పటి చూసి మృతుడి కుటుంబసభ్యులు అవి వీరేశ్వని గుర్తించారు. అస్థిపంజరం నుంచి నమూనాలు ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గంగమ్మది లాకప్ డెత్..:

ఇంతలో ఆదివారం గంగమ్మ అనుమానాస్పద స్థితిలో మరణించడం సంచలనమైంది. 'అనారోగ్యంతో రెండు రోజుల కిందట గంగమ్మ ఆదోని ఆసుపత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం శనివారం కర్నూలులోని కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించార'ని పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోలీసు బందోబస్తు మధ్య బదినేహాలుకు తీసుకొచ్చి హడావుడిగా అంత్యక్రియలు జరిపించారు. సిట్ అధికారులకు 'పాత్రికేయ' ప్రతినిధులు ఫోన్ చేయగా స్పందించలేదు. గంగమ్మది అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదుచేశారు. వీరేశ్ హత్యకేసులో దర్గప్పను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.






## పోనాకల్ గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు





**ఖానాపూర్ ఆర్సి మన దునియా ,జూన్;02.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పోనాకల్ గ్రామంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న తరచూ విద్యుత్ కోతల వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రైతులు సాగునీటి అవసరాల కోసం, విద్యార్థులు చదువుల కోసం, వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాల నిర్వహణలో ఇబ్బందులు పడుతుండగా, చిన్నపిల్లలు, వృద్ధులు మరియు సాధారణ ప్రజలు కూడా విద్యుత్ అంతరాయాలతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో ఈరోజు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, పోనాకల్ గ్రామానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, అనవసర విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేయాలని, ప్రజల సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు.గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో గ్రామ ప్రజలతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు మరియు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు





- **ఐటీడీఏ పీవో మంద మకరందుతో కలిసి మొక్కల నాటిన ఎడమ బొజ్జు పటేల్**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,ఉట్నూర్, జూన్ 2:**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తన క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన అవతరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.తదుపరి ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఐటీడీఏ పీవో మంద మకరందుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. తెలంగాణ తల్లి మరియు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంత ప్రజల అభివృద్ధికి విద్య కీలకమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.అలాగే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ పోషించిన పాత్రను గుర్తు చేస్తూ, ప్రత్యేక రాష్ట్ర సాధన ప్రజల దీర్ఘకాల ఆకాంక్షకు ఫలితమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు, అధికారులకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలో పీవో మంద మకరందుతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణకు వర్ష సూచన.. రానున్న 4 రోజుల్లో తగ్గనున్న ఉష్ణోగ్రతలు!

**మన దునియా,హైదరాబాద్:జూన్ 02**

తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది.బిఎండ తీవ్రతతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ రాబోయే మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. నైరుతి రుతుపవనాల రాకతో పాటు వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా తగ్గనున్నట్లు ప్రకటించింది.ఆగ్నేయ అరబిక్ మహాసముద్రం, లక్షద్వీప్ దీవులు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలతో పాటు బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాల్లోకి నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. జూన్ 4వ తేదీ లోగా ఈ రుతుపవనాలు మరింత ముందుకు ప్రవేశించడానికి పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని వాతావరణశాఖ స్పష్టం చేసింది.మరోవైపు, తూర్పు మధ్యప్రదేశ్ మరియు దానికి సమీపంలోని ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో ఉపరితల చక్రవాక ఆవర్తనం కేంద్రీకృతమై ఉంది. ఇది సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో పాటు.. ఛత్తీస్‌గఢ్ నుండి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఈశాన్య తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది.ఈరోజు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. రేపు తెలంగాణలోని పలు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడవచ్చు. ఎల్లుండి రాష్ట్రంలోని చాలా జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉంది.ఈరోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.గడిచిన కొన్ని రోజులుగా రికార్డు స్థాయి ఎండలతో సతమతమవుతున్న జనాలకు ఉపశమనం లభించనుంది. రానున్న నాలుగు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
RNI Number




# నరసింహులపల్లిలో కుల వివక్ష ఆరోపణలు.ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్




**హుజురాబాద్ నియోజకవర్గం,వీణవంక, మన దునియా**

కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని నరసింహులపల్లి గ్రామంలో కుల వివక్షకు సంబంధించిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గ్రామానికి చెందిన వంతడుపుల పోచమ్మ ఇటీవల మృతి చెందగా, ఆమె అంత్యక్రియల కోసం గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను ఇవ్వాలని కుటుంబ సభ్యులు సర్పంచ్‌ను కోరారు. సర్పంచ్ అనుమతి ఇచ్చినప్పటికీ, ట్రాక్టర్ డ్రైవర్ ఖండం కిషన్‌రావు వాహనం నడపడానికి నిరాకరించాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, తాము తక్కువ కులానికి చెందినవారమంటూ అవమానకర వ్యాఖ్యలు చేస్తూ, ట్రాక్టర్ నడపనని డ్రైవర్ చెప్పాడని పేర్కొన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని గ్రామస్థులు తెలిపారు.విషయం తెలుసుకున్న ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంఘటనపై వివరాలు సేకరించారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌పై ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వంతడుపుల బాబు మాట్లాడుతూ, కుల వివక్షకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఇప్పటికీ సమాజంలో కుల వివక్ష ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని గ్రామ ప్రజలు అభిప్రాయపడ్డారు.



నరసింహులపల్లి గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌పై పూర్తి స్థాయి విచారణ జరిపి, నిజానిజాలు వెలికి తీసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఈ ఘటనపై కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఘటనకు సంబంధించి అధికారుల విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# ప్రజలకు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాలి




**ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి ఐపీఎస్**

**షాద్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్**

**ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందనతో పాటు నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు**

**రౌడీషీటర్లు, అలవాటు నేరస్తులు, సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా పెట్టండి**

**మప దునియా,షాద్‌నగర్:జూన్ 02**

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ మంగళవారం సందర్శించి స్టేషన్ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో శాంతిభద్రతల నిర్వహణ, నేరాల దర్యాప్తు, నివారణ చర్యలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు, వినతిపత్రాల పరిష్కారం, నేర గణాంకాలు, శాఖాపరమైన కార్యక్రమాల అమలుపై సమీక్ష చేపట్టారు.పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో, ప్రజామిత్ర విధానంలో సేవలు అందించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందనతో పాటు నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. బీట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని సూచించారు. గ్రామ పోలీసు అధికారులు (వీపీఓలు) గ్రామాల్లో సమాచార సేకరణను ముమ్మరం చేసి అనుమానాస్పద కదలికలు, కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలతో సమన్వయం పెంచి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, అలవాటు నేరస్తులు, సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వ్యాప్తి, అక్రమ కార్యకలాపాలు, సైబర్ నేరాలు, జూదం తదితర నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మహిళల భద్రత, బాలల రక్షణ, వృద్ధుల సంక్షేమం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నేరాల ఛేదన, దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ టూల్స్ వినియోగాన్ని పెంచాలని తెలిపారు.



శాంతి భద్రతలు, సామరస్య వాతావరణం, ప్రజా శాంతి పరిరక్షణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వర్తించాలని కమిషనర్ సూచించారు.పోలీస్ స్టేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, ప్రజల భద్రత కోసం కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ జోన్ డీసీపీ షిరీషా రాఘవేంద్ర, షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సిఐ సీతారాం తదితరులు పాల్గొన్నారు..

## ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం

**మన దునియా, జూన్ 02,మంచిర్యాల**



కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మందమర్రి మండలం చిర్రకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిర్మాణం పూర్తి అయిన ఇళ్లను గ్రామ సర్పంచ్ రామటంకి శ్రీలత,తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు పేదల సంక్షేమం కొరకు పాటుపడుతుందని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో పేదవాడికి కనీసం ఒక ఇల్లు కూడా కట్టించిన దాఖలాలు లేవని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒకరికి సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహేష్, కార్యదర్శి రమేష్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామ ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణ సాధనలో కిషన్ రెడ్డి పాత్ర చారిత్రాత్మకం

**షాద్ నగర్ బిజెపి నేత నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**

**కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి నివాసంలో జరిగిన జెండా ఆవిష్కరణ**

**మన దునియా,న్యూఢిల్లీ:జూన్ 02**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి నివాసంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన విశిష్ట పాత్రను కొనియాడారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో కిషన్ రెడ్డి ప్రారంభం నుంచే అంకితభావంతో పనిచేశారని అన్నారు. తెలంగాణ పోరు యాత్రల ద్వారా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఢిల్లీ వేదికగా తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయిలో వినిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.తెలంగాణ అంశంపై కాంగ్రెస్ పార్టీ పదేపదే హామీలు ఇచ్చి ప్రజలను నిరాశపరిచిన సమయంలో, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు స్పష్టమైన మద్దతు ప్రకటించి ప్రజలకు అండగా నిలిచిందన్నారు. ముఖ్యంగా మాజీ కేంద్ర మంత్రి సుష్మ స్వరాజ్ పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజలకు భరోసా కల్పిస్తూ చేసిన ప్రకటన ఉద్యమకారులకు గొప్ప ధైర్యాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వడంలో, తెలంగాణ ఉద్యమాన్ని జాతీయ రాజకీయ అజెండాగా మార్చడంలో కిషన్ రెడ్డి కృషి మరువలేనిదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలతో పాటు కిషన్ రెడ్డి వంటి నాయకుల నిరంతర పోరాటం కూడా ప్రధాన కారణమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన కిషన్ రెడ్డి సేవలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరవదని, తెలంగాణ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు..



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## తెలంగాణ రాష్ట్ర 13వ ఆవిర్భావ దినోత్సవం





**సంగెం మనదునియా జూన్2**

ఈరోజు గవి చర్ల గ్రామంలో 13వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం గ్రామ సర్పంచ్ భాష పాక సదయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగినాయి ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ తెలంగాణ త్యాగాలకు నిలయం అంటూ అమరవీరుల స్థూపం వద్ద అమరులకు నివాళు లర్పిస్తూ తెలంగాణ అంటేనే వృక్ష సంపద జంతు సంపద ఖనిజ సంపద మరియు అనేక విధములైన సంపదలకు నిలయం ఇలాంటి తెలంగాణలో పుట్టినందుకు నేను గర్విస్తున్నాను అమ్మ సోనియమ్మ 2009 డిసెంబర్ 9న తన పుట్టినరోజు సందర్భంగా తెలంగాణలో జరిగిన పరిణామాలను త్యాగాల పరిణామాలను గుర్తుచేసుకొని తెలంగాణ 29వ రాష్ట్రం రాష్ట్రంగా అవతరించినందుకు కృషి చేసిందని గుర్తు చేస్తూ తెలంగాణ అభివృద్ధి సాధించాలంటే కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని 135వ ఏళ్ల తరబడి కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని ఆదర్శంగా నిలుస్తుంది అని ప్రజలే ముఖ్యమని భావిస్తూ ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను తీసుకువచ్చి అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా పాలన నిర్వహిస్తూ ఇప్పటికీ రేవంత్ సార్ సర్కార్ పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో మన అందరిపై దృష్టి ఉంటుందని వివరించారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గుమ్మడి సంపత్ గ్రామ కార్యదర్శి శరత్ కుమార్ వార్డ్ మెంబర్స్ భాష పాక అశోక్ యారా పూజ రఘు వెల్దండ రాధిక భాస్కర్ ముప్పురాధికా రమేష్ గూడ రామ రాజు అచ్చ వర్ష మార్కెట్ డైరెక్టర్ అర్చ నాగరాజు ధోనికల బాలకిషన్ వేల్పుల రమ రాజు వేల్పుల వంశీ వేల్పుల శ్రావణి కే కరుణాకర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు అచ్చ బాలరాజ్ కునూరి సతీష్ కూస వెంకన్న బెరోజు రాజు మాజీ సర్పంచ్ పత్తిపాక రమేష్ మరియు సురేందర్ గౌడ్ గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు యువకులు మరియు తదితరులు పాల్గొన్నారు

## ములుగు జిల్లా వాజేడు మండలం లో గ్రామపంచాయతీ పాఠశాలల్లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సంబరాలు జరిగాయి

**మన దునియా, వాజేడు,జూన్ 2**






తెలంగాణ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా ఈరోజు జూన్ 2 తెలంగాణ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించ దగ్గర రోజు దశాబ్దాల నిరీక్షణకు ఎందరు వీరుల విరోచక పోరాటాలకు మరెందరో అమరవీరుల త్యాగాలకు ప్రతిరూపంగా 2014 జూన్ 2 తేదీన మన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది ఇది కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవం ప్రతీక నీళ్ళు నిధులు నియామకాలు అనే నినాదంతో సాగిన ఈ ఉద్యమం ప్రపంచ చరిత్రలోనే అత్యంత శాంతియుతమైన సుదీర్ఘమైన ప్రజా ఉద్యమాలతో ఒకటిగా నిలిచింది 1969 తొలిదశ ఉద్యమం నుండి 2001లో ప్రారంభమైన మలి దశ ఉద్యమం వరకు విద్యార్థులు కౌవులు కళాకారులు ఉద్యోగులు కార్మికులు, రైతులు ఇలా ప్రతి ఒక్కరూ ఒకే తాటిపైకి వచ్చి



పోరాడారు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగం చేసిన అమరవీరుల అందరికీ నివాళులర్పిస్తూ వారి త్యాగాల పునాదులపై ఈరోజు మన స్వచ్ఛ మైన తెలంగాణ నిలబడింది రాష్ట్రం ఏర్పడిన నాటినుండి నేటి వరకు మన తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోతుంది వ్యవసాయము ఐటి పరిశ్రమలు సంక్షేమ పథకాలు దేశాన్ని ఆదర్శాలుగా నిలుస్తుంది మన సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ బోనాలు పండుగలు ఈరోజు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు కళాశాలలు గ్రామపంచాయతీలు చాలా ఘనంగా జరుపుకుంటున్నారు



# తెలంగాణ అభివృద్ధికి బీజేపీ సంపూర్ణ కట్టుబాటు - నితిన్ నబీన్








**ఢిల్లీలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**

**మన దునియా,న్యూఢిల్లీ:జాన్ 02**

న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తెలంగాణ రెసిడెంట్స్ ఆఫ్ ఢిల్లీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జి. కిషన్ రెడ్డి, ఎన్. రాంచందర్ రావు, రఘునందన్ రావు, దీపికా రెడ్డి తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రసంగించిన నితిన్ నబీన్ తెలంగాణ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ సంపూర్ణ కట్టుబాటుతో పనిచేస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులకు నాయకులు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ రాష్ట్ర సాధన కోసం అనేక మంది చేసిన త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడిగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి చురుకైన పాత్ర పోషించారు. కార్యక్రమానికి విచ్చేసిన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా వేడుకలను విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ రెసిడెంట్స్ ఆఫ్ ఢిల్లీ నిర్వాహకులను నాయకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్, సాయి కిరణ్, మహిపాల్ రెడ్డి, రాఘవేందర్ తదితరులతో పాటు ఢిల్లీలో నివసిస్తున్న తెలంగాణ వాసులు, వివిధ రంగాల ప్రముఖులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# “ఉద్యోగాన్ని త్యాగం చేసి తెలంగాణ కోసం పోరాడిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి”

**“సిద్ధాంతం కోసం రాజకీయాలు..**

**తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు”**

**మన దునియా,షాద్‌నగర్:జాన్ 02**

షాద్‌నగర్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించారని, తెలంగాణ వాదాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమ బాట పట్టిన అసలుసిసలైన తెలంగాణ ఉద్యమకారుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అని పలువురు ఉద్యమకారులు పేర్కొన్నారు.విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాటం ప్రారంభించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన కోసం తన వ్యక్తిగత భవిష్యత్తును పక్కనపెట్టి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని త్యాగం చేశారు. తెలంగాణ భావజాలాన్ని ఉపాధ్యాయులు, మేధావులు, యువతలో విస్తృతంగా వ్యాప్తి చేయడానికి నిరంతరం కృషి చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2007, 2011 సంవత్సరాల్లో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన, తెలంగాణ వాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విశేషంగా శ్రమించారు. అనంతరం 2014, 2018 సంవత్సరాల్లో భారతీయ జనతా పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, ముఖ్యంగా షాద్‌నగర్ ప్రాంత ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించారు. ఎన్నికల్లో విజయం సాధించకపోయినా ప్రజా సేవే ధ్యేయంగా ప్రజల మధ్య కొనసాగారు.తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్‌గా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలనే డిమాండ్‌ను గ్రామ గ్రామానికి తీసుకెళ్లారు. హైదరాబాద్ విమోచన చరిత్రను ప్రజలకు తెలియజేస్తూ తెలంగాణ విమోచన భావజాలంపై అవగాహన కల్పించేందుకు కృషి చేశారు. ఆయనతో పాటు అనేక జాతీయవాద శక్తులు చేసిన దీర్ఘకాల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేకుండా అనేక మంది నాయకులు ఉన్నత పదవులు పొందినా, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాత్రం పదవుల కోసం కాకుండా సిద్ధాంతం కోసం రాజకీయాలను ఎంచుకున్నారని ఉద్యమకారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన, తెలంగాణ విమోచన భావజాలం, జాతీయవాద సిద్ధాంతాల పట్ల అచంచల విశ్వాసంతో ప్రజా జీవితంలో కొనసాగుతున్నారని కొనియాడారు.తెలంగాణ కోసం చేసిన త్యాగం, ఉద్యమం కోసం చేసిన పోరాటం, తెలంగాణ విమోచన దినోత్సవం కోసం సాగించిన దీర్ఘకాల ఉద్యమం, జాతీయవాదం కోసం చేస్తున్న నిరంతర కృషి




నెల్లి శ్రీవర్ధన్ రెడ్డిని నిబద్ధత కలిగిన తెలంగాణ ఉద్యమకారుడిగా నిలబెట్టాయని పలువురు అభిప్రాయపడ్డారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కోసం పోరాడిన అమరవీరులు, ఉద్యమ నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సేవలను స్మరించుకోవాలని, వారి త్యాగాలను గౌరవించాలని పిలుపునిచ్చారు..

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జూన్ | బుధవారం | 3 | 2026



# ఆఫ్ఘనిస్థాన్‌తో ఏకైక టెస్టు.. చండీగఢ్ చేరుకున్న టీమిండియా



**శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్న టీమిండియా**

**జట్టుతో పాటు కెప్టెన్ గిల్, వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్, పంత్, నితీశ్ రెడ్డి**

**గత ఏడాది సౌతాఫ్రికా చేతిలో ఓటమి తర్వాత భారత్ ఆడుతున్న తొలి టెస్ట్**

**2018 తర్వాత భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్ ఇది**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 ముగిసిన తర్వాత భారత క్రికెట్ జట్టు తిరిగి టెస్ట్ ఫార్మాట్‌పై దృష్టి సారించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్ కోసం శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా మంగళవారం చండీగఢ్‌కు చేరుకుంది. ఇక్కడి ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జూన్ 6, శనివారం నుంచి ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.నగరానికి చేరుకున్న భారత జట్టు నేరుగా టీమ్ హోటల్‌కు వెళ్లింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు కొత్తగా వైస్ కెప్టెన్ బాధ్యతలు చేపట్టిన కేఎల్ రాహుల్, వికెట్ కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్, యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తదితరులు జట్టుతో పాటు కనిపించారు. రాబోయే రోజుల్లో జట్టు ప్రాక్టీస్ సెషన్లను ప్రారంభించనుంది.గత ఏడాది స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో 2-0 తేడాతో ఓటమి పాలైన తర్వాత భారత్ ఆడుతున్న తొలి టెస్టు మ్యాచ్ ఇదే. ఈ మ్యాచ్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పరిధిలోకి రానప్పటికీ, ఈ ఏడాది చివర్లో శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనలకు సన్నాహకంగా ఇది టీమిండియాకు చాలా కీలకం. అనుభవం, యువ ప్రతిభ కలయికతో ఉన్న ఈ జట్టుతో టెస్టుల్లో తిరిగి లయను అందుకోవాలని భారత్ భావిస్తోంది.భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య టెస్టుల్లో ఇది రెండో ముఖాముఖి. 2018లో బెంగళూరు వేదికగా ఆఫ్ఘనిస్థాన్ తమ అరంగేట్ర టెస్టును భారత్‌తోనే ఆడింది. ఆ మ్యాచ్‌లో భారత్ కేవలం రెండు రోజుల్లోనే ఇన్నింగ్స్ 262 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఎనిమిదేళ్ల తర్వాత ఈ రెండు జట్లు మళ్లీ టెస్టు ఫార్మాట్‌లో తలపడబోతున్నాయి.

# 15 ఏళ్ల క్రికెట్ సంచలనం.. వైభవ్ సక్సెస్ సీక్రెట్‌పై ఐఐఎం ఇండోర్ ప్రత్యేక అధ్యయనం!

**15 ఏళ్ల క్రికెటర్ వైభవ్ సూర్యవంశీపై ఐఐఎం ఇండోర్ కేస్ స్టడీ**

**'వైభవ్ మోడల్' పేరుతో అతని విజయం వెనుక కారణాలపై పరిశోధన**

**యువతలో ప్రతిభను గుర్తించి, ఒత్తిడిని అధిగమించడంపై అధ్యయనం**

**క్రీడలు, సైకాలజీ, మేనేజ్‌మెంట్ నిపుణులతో దేశంలోనే తొలి మల్టీడిసిప్లినరీ స్టడీ**

కేవలం 15 ఏళ్ల వయసులోనే క్రికెట్ ప్రపంచాన్ని తన అసాధారణ ప్రతిభతో ఆశ్చర్యపరిచిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థ దృష్టిని ఆకర్షించాడు. అతని మానసిక దృఢత్వం, చిన్న వయసులోనే సాధించిన అద్భుత విజయాల వెనుక ఉన్న రహస్యాలను తెలుసుకునేందుకు ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఇండోర్ ముందుకొచ్చింది. 'వైభవ్ మోడల్' పేరుతో అతనిపై ఒక ప్రత్యేక కేస్ స్టడీని నిర్వహించనున్నట్లు ప్రకటించింది. క్రీడలు, మనస్తత్వ శాస్త్రం (సైకాలజీ), మేనేజ్‌మెంట్ రంగాల నిపుణులతో కలిసి చేస్తున్న ఈ పరిశోధన, దేశంలోనే మొట్టమొదటి మల్టీడిసిప్లినరీ స్టడీ కావడం విశేషం.

సూపర్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ

ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన ఈ యువ ఓపెనర్, తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరినీ మంత్రముగ్ధుల్ని చేశాడు. కేవలం 16 ఇన్నింగ్స్‌లలో 48.50 సగటు, 237.30 అనే అసాధారణ స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించాడు. ఈ క్రమంలోనే టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా ఆరెంజ్ క్యాప్‌ను కైవసం చేసుకున్నాడు. అంతేగాక ఒకే సీజన్‌లో ఏకంగా 72 సిక్సర్లు బాది, 14 ఏళ్లుగా క్రిస్ గేల్ పేరిట ఉన్న 59 సిక్సర్ల రికార్డును బద్దలు కొట్టాడు. ఈ ప్రదర్శనకు గాను 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్', 'సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్' అవార్డులను సైతం గెలుచుకున్నాడు.

అధ్యయనం ఉద్దేశం ఏమిటి?

ఐఐఎం ఇండోర్ డైరెక్టర్ హిమాన్షు రాయ్ ఈ కేస్ స్టడీ వివరాలను వెల్లడించారు. "చిన్న వయసులోనే ఇంతటి నైపుణ్యం, ఒత్తిడిని తట్టుకునే మానసిక స్థైర్యం ఎలా సాధ్యమైంది? అనే అంశాలను లోతుగా పరిశీలిస్తాం. ఈ అధ్యయనం కేవలం వైభవ్ క్రికెట్ విజయాలకే పరిమితం కాదు. అతని ఎదుగుదలకు దోహదపడిన సామాజిక, మానసిక, కుటుంబ, సంస్థాగత కారణాలను కూడా విశ్లేషిస్తాం" అని ఆయన వివరించారు. "ప్రతిభ అనేది దేవుడిచ్చిన వరం కావచ్చు. కానీ, దీర్ఘకాలిక విజయం అనేది కఠోర శ్రమ, కుటుంబ మద్దతు, అంకితభావం, మార్గదర్శకుల సూచనలు, బలమైన విలువలపై ఆధారపడి ఉంటుంది. ఈ అంశాలన్నింటినీ మా అధ్యయనంలో పొందుపరుస్తాం" అని రాయ్ తెలిపారు. ఈ పరిశోధన ద్వారా వెలువడే ఫలితాలు భవిష్యత్ మేనేజర్లు, విధాన రూపకర్తలకు ఎంతో ఉపయోగపడతాయని ఐఐఎం ఫ్యాకల్టీ సభ్యులు అభిప్రాయపడుతున్నారు. అసాధారణ ప్రతిభావంతులు ఎలా అభివృద్ధి చెందుతారు, తీవ్రమైన ఒత్తిడిలో ఎలా రాణిస్తారనే విషయాలపై స్పష్టత వస్తుందని వారు చెబుతున్నారు. అదే సమయంలో చిన్న వయసులోనే వచ్చే కీర్తి, సోషల్ మీడియా ప్రభావం, అధిక అంచనాల వంటి సవాళ్లను ఎలా ఎదుర్కొంటున్నారనేది కూడా ఈ అధ్యయనంలో పరిశీలించనున్నారు. ఈ 'వైభవ్ మోడల్' ద్వారా ఇతర యువ ప్రతిభావంతులు కూడా తమ విజయాన్ని సుస్థిరం చేసుకునేలా ఒక మార్గాన్ని చూపడంతో పాటు కార్పొరేట్ ప్రపంచంలో టాలెంట్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన పాఠాలను అందించడమే తమ లక్ష్యమని హిమాన్షు రాయ్ స్పష్టం చేశారు.



# ఇంగ్లండ్ టూర్ కు వైభవ్ సూర్యవంశీ? సంకేతాలు పంపిన బీసీసీఐ కార్యదర్శి!



ఐపీఎల్‌లో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ అవార్డులు సాధించిన వైభవ్

ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్న 15 ఏళ్ల యువ కెరటం వైభవ్ సూర్యవంశీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి బలమైన మద్దతు లభిస్తోంది. రాబోయే వైట్-బాల్ పర్యటన కోసం అతడిని జాతీయ జట్టులోకి వేగంగా తీసుకురావాలని సెలక్టర్లకు బీసీసీఐ పరోక్షంగా సూచించింది. వైభవ్ ప్రతిభను 'అసాధారణం' అని అభివర్ణించిన బోర్డు, అతని విషయంలో ఏది అవసరమో అది చేయాలని సెలక్టర్లకు స్పష్టం చేసింది.రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ సూర్యవంశీ, ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 16 మ్యాచ్‌లలో 237.31 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో అత్యధికంగా 72 సిక్సర్లు కొట్టడంతో పాటు 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్', 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డులను కూడా గెలుచుకున్నాడు. అతని దూకుడైన బ్యాటింగ్ శైలితో, అతడిని వెంటనే జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి.ఈ విషయంపై జాతీయ మీడియాతో మాట్లాడిన బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా, వైభవ్‌పై ప్రశంసలు కురిపించారు. "వైభవ్ అద్భుతమైన ఆటగాడు. రాబోయే ఇంగ్లండ్ పర్యటన కోసం భారత జట్టు ఎంపిక సమావేశాల్లో, సెలక్టర్లు అతని ప్రదర్శనను దృష్టిలో ఉంచుకుని, అతనికి ఏది మంచిదో అదే చేస్తారని నేను కచ్చితంగా నమ్ముతున్నాను" అని పేర్కొన్నారు. వైభవ్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు బీసీసీఐ అన్ని విధాలా సహకరిస్తుందని ఆయన తెలిపారు. ఈ నెలాఖరులో భారత జట్టు ఐర్లాండ్‌తో రెండు టీ20లు, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో వైభవ్‌కు తొలిసారిగా టీమిండియా నుంచి పిలుపు వస్తుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా మాజీ క్రికెటర్ అజయ్ జడేజా కూడా, వయసుతో సంబంధం లేకుండా వైభవ్‌ను ఎంపిక చేయాలని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను బహిరంగంగా కోరారు. ఇప్పటికే ఇండియా 'ఏ' జట్టులో ఉన్న వైభవ్‌ను నేరుగా సీనియర్ జట్టుకు ప్రమోట్ చేసేందుకు బీసీసీఐ సానుకూలంగా ఉన్నట్లు ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

# క్రికెట్ చరిత్రలో తొలిసారి.. భారత్‌లో భారత్‌కే ఆఫ్ఘనిస్థాన్ ఆతిథ్యం!

క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన, ఆసక్తికరమైన ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ జట్టు తొలిసారిగా టీమిండియాకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. అయితే విశేషం ఏమిటంటే.. ఈ చారిత్రక 'హోమ్' సిరీస్‌కు వేదికగా నిలవబోయేది కూడా భారత దేశమే. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను నిర్వహించేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయి.బీసీసీఐ, ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) మధ్య ఉన్న బలమైన స్నేహపూర్వక సంబంధాల నేపథ్యంలో ఈ సిరీస్ సాధ్యమవుతోంది. రిటర్న్ టూర్‌లో భాగంగా ఈ సిరీస్‌ను నిర్వహించాలని ఏసీబీ చేసిన ప్రతిపాదనకు బీసీసీఐ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇరు బోర్డుల మధ్య ఇప్పటికే ఒక అవగాహన కుదిరిందని, లాంఛనాలు పూర్తయిన తర్వాత అధికారిక ప్రకటన వెలువడుతుందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఐర్లాండ్, శ్రీలంక, జింబాబ్వే వంటి బోర్డులకు ఆర్థికంగా, క్రీడాపరంగా అండగా నిలిచేందుకు బీసీసీఐ గతంలోనూ ఇటువంటి సిరీస్‌లు నిర్వహించిన విషయం తెలిసిందే.ఈ సిరీస్ కోసం వేదికను ఖరారు చేసేందుకు బీసీసీఐయే చొరవ తీసుకుని ఏసీబీ, ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) మధ్య చర్చలు జరిపింది. సెప్టెంబర్ 13, 16, 19 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. ఈ సిరీస్ కోసం డీడీసీఏ తమ స్థానిక ఢిల్లీ ప్రీమియర్ లీగ్ టీ20 షెడ్యూల్‌ను కూడా సర్దుబాటు చేస్తోంది.స్వదేశంలో రాజకీయ అస్థిరత, భద్రతా కారణాల వల్ల ఆఫ్ఘనిస్థాన్ గత దశాబ్ద కాలంగా తమ అంతర్జాతీయ 'హోమ్' మ్యాచ్‌లను భారత్, యూఏఈలలో ఆడుతోంది. గతంలో 2017లో ఐర్లాండ్‌తో గ్రేటర్ నోయిడాలో, 2018లో బంగ్లాదేశ్‌తో డెహ్రాడూన్‌లో సిరీస్‌లు ఆడింది.

జూన్‌లో మరో పర్యటన

ఇదిలా ఉంటే.. ఈ టీ20 సిరీస్ కంటే ముందే ఆఫ్ఘన్ జట్టు మరో సుదీర్ఘ పర్యటన కోసం భారత్‌కు రానుంది. జూన్ 6 నుంచి 20 మధ్య ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొంటుంది. ఈ రెండు ఫార్మాట్లలోనూ హష్మతుల్లా షాహిదీ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. జూన్ 6న న్యూ చండీగఢ్‌లో ఏకైక టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుండగా.. జూన్ 14, 17, 20 తేదీల్లో ధర్మశాల, లక్నో, చెన్నై వేదికలుగా మూడు వన్డేలు జరగనున్నాయి.



మన దునియా
RNI Number TT TT /2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

## హీరో విజయ్‌తో రిలేషన్ రూమర్స్.. పరోక్షంగా కౌంటర్ ఇచ్చిన నటి త్రిష!



**తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేసిన త్రిష**


**తన వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తానని వ్యాఖ్య**

**త్రిష 'మ్యాజికల్ మే' పోస్ట్ కూడా వైరల్ అవుతున్న వైనం**

తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే రూమర్లపై స్పందించని త్రిష, తాజాగా సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేస్తూ.. "నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను" అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ, తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారికి కౌంటర్‌గానే ఈ పోస్ట్ పెట్టారని అభిమానులు భావిస్తున్నారు. మరోవైపు, మే నెల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ త్రిష చేసిన "మ్యాజికల్ మే" పోస్ట్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా తన ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మే నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే సమయంలో తన ఆప్తమిత్రుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సాధించి సీఎం కావడం విశేషం. దీనికి తోడు ఆమె నటించిన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచి 348 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ వరుస విజయాల వల్లే ఆమె ఈ పోస్ట్ పెట్టారు.

## 'పెద్ది' ట్రైలర్ పై విమర్శలు... వివరణ ఇచ్చిన దర్శకుడు బుచ్చిబాబు

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది' జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. అయితే, ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మిశ్రమ స్పందనలు వస్తున్న నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు సానా స్పందించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, సినిమాలోని కీలకమైన సన్నివేశాలు బయట రాకూడదనే ఉద్దేశంతో, ట్రైలర్‌లో కొన్ని అంశాలను పరిమితంగా చూపించామని స్పష్టం చేశారు. "కథలో ఉన్న ముఖ్యమైన పాయింట్ బయటపెడితే సినిమా చూసేటప్పుడు ఆ మజా పోతుంది. అందుకే సుమారు 50 నిమిషాల కీలకమైన ఫుటేజ్‌ను ట్రైలర్ కోసం వాడలేదు. ఆ కంటెంట్ చేర్చకపోవడం వల్లే, మేము చెప్పాలనుకున్నది ట్రైలర్ లో పూర్తిగా చెప్పలేకపోయాం" అని బుచ్చిబాబు వివరించారు.కొన్నిసార్లు యావరేజ్ ట్రైలర్‌లు ఉన్న సినిమాలు కూడా థియేటర్లలో అద్భుత విజయం సాధించాయని, తమ సినిమా కూడా అదే కోవలో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కథను ఎక్కువగా చెబితే అసలు విషయం తెలిసిపోతుందని అన్నారు.'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రాన్ని 1980ల నాటి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందించారు. ఇందులో రామ్ చరణ్ బహుముఖ ప్రజ్ఞావంతుడైన అథ్లెట్‌గా, సామాజిక నాయకుడిగా కనిపించనున్నారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా.. శివరాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించారు.నిన్న జూన్ 1న విజయవాడలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు చిత్ర బృందం కనకదుర్గమ్మ వారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకుంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రీమియర్ షోల కోసం అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.






## బాలీవుడ్‌లో అలా.. టాలీవుడ్‌లో ఇలా: జాన్వీ కపూర్ ఆసక్తికర వ్యాఖ్యలు

**తెలుగులో సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇస్తారన్న జాన్వీ**

**బాలీవుడ్ సినిమాలు షెడ్యూల్స్ ప్రకారం నడుస్తాయని వెల్లడి**

**టాలీవుడ్‌లో పని వేళలు సౌకర్యవంతంగా ఉంటాయని కితాబు**

**భోజన విరామ సమయాలను కచ్చితంగా పాటిస్తారని వ్యాఖ్యలు**

**హిందీ సినిమాలు త్వరగా పూర్తవుతాయని చరణ్ ప్రశంస**

టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పని సంస్కృతిపై నటి జాన్వీ కపూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు సినిమా సెట్స్‌లో ఇచ్చే గౌరవం, అక్కడి వాతావరణం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటించిన జాన్వీ రెండు పరిశ్రమల మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసాలను పంచుకున్నారు.

క్రియేటివిటీకే ప్రాధాన్యం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ పూర్తిగా సినిమాపై ఉన్న ఇష్టం, పట్టుదలతో నడుస్తుందని జాన్వీ కపూర్ అభిప్రాయపడ్డారు. మంచి సినిమా తీయడం కోసమే ఇక్కడి దర్శకులు ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. అవసరమైతే నిర్మాణ సమయాన్ని పొడిగిస్తారని పేర్కొన్నారు. షూటింగ్ షెడ్యూల్స్ కంటే సృజనాత్మకతకే ఎక్కువ విలువ ఉంటుందని వివరించారు. హిందీ పరిశ్రమలో మాత్రం అంతా పక్కా ప్రణాళిక, గడువుల ప్రకారం జరుగుతుందని చెప్పారు. బాలీవుడ్‌లో సమయానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కొన్నిసార్లు కథ విషయంలో రాజీ పడాల్సి వస్తుందని వివరించారు.

భోజన విరామానికి ప్రత్యేక గౌరవం

తెలుగు సినిమా సెట్స్‌లో నటీనటులు, సాంకేతిక నిపుణులను చూసుకునే విధానం అద్భుతంగా ఉంటుందని జాన్వీ ప్రశంసించారు. ఇక్కడ పని వేళలు చాలా పద్ధతిగా ఉంటాయని, అందరికీ తగినంత విశ్రాంతి దొరుకుతుందని చెప్పారు. ముఖ్యంగా లంచ్ బ్రేక్‌ను ఇక్కడ చాలా సీరియస్‌గా తీసుకుంటారని వెల్లడించారు. సెట్స్‌లో అందరూ ప్రశాంతంగా తిని, మళ్లీ ఉత్సాహంగా పని చేసేలా ప్రోత్సహిస్తారని అన్నారు. రోజుకు 9 నుంచి 10 గంటలు మాత్రమే షూటింగ్ చేస్తారని, నైట్ షూట్స్ కూడా తెల్లవారుజామునే ముగించి విశ్రాంతి ఇస్తారని వెల్లడించారు. ముంబైలో ఇలాంటి వాతావరణం కనిపించదని స్పష్టం చేశారు.

చరణ్ ఆసక్తికర వ్యాఖ్యలు

బాలీవుడ్‌లో సినిమాలు చాలా వేగంగా ముగుస్తాయని, ఆ పనితీరు తనకు ఎంతో ఇష్టమని హీరో రామ్ చరణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాము నటిస్తున్న 'పెద్ది' సినిమా కోసమే రెండు సంవత్సరాల కాలంలో సుమారు 285 రోజులు షూటింగ్ చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. దీనిపై జాన్వీ స్పందిస్తూ బాలీవుడ్‌లో కొన్ని సినిమాలు కేవలం 30 నుంచి 40 రోజుల్లోనే పూర్తయిపోతాయని చెప్పారు. రెండు పరిశ్రమల నిర్మాణ శైలిలో ఎంతో తేడా ఉందని అన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com